క్లుప్తంగా

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీలకు ఫైళ్లు సిద్ధం చేస్తున్న సిబ్బంది

తుగ్గలి : మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి వేతన దారులకు రూ.23.39 కోట్లు చెల్లించారు. మరో రూ.6.88కోట్లు మెటీరియల్ కింద చెల్లింపులు చేశారు. వీటిపై గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించనున్నాయి. శనివారం నుంచి తనిఖీ బృందాలు గ్రామాలకు వెళ్లనున్నట్లు ఏపీఓ హేమసుందర్ తెలిపారు.

బ్రహ్మగుండంలో ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



ఆలయ సిబ్బందితో చర్చిస్తున్న సీఐ, ఎస్ఐ

వెల్దుర్తి: ప్రముఖ శైవ క్షేత్రం కామేశ్వరీదేవి సమేత బ్రహ్మేశ్వరుడు కొలువైన బ్రహ్మగుండంలో ఈనెల 26వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను శుక్రవారం సీఐ మధుసూదన్ రావు, ఎస్ఐ అశోక్ పరిశీలించారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం పార్కింగ్, క్యూలైన్, కోనేరు వద్ద తీసుకోవాల్సిన చర్యలు, జాగరణ, కల్యాణం, రథోత్సవం సందర్భంగా బందోబస్తుపై ఆలయ సిబ్బంది మద్దిలేటితో చర్చించారు. భక్తుల రాక, అంగళ్ల, సౌకర్యాల ఏర్పాటు, ఉత్సవాల కార్యక్రమాలను తెలుసుకున్నారు. జెయింట్ వీల్ తదితరాల నిర్వాహకులను నిబంధనల మేరకు అనుమతులు తీసుకోవాలంటూ ఆదేశించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

చిప్పగిరి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ అధికారులు డాక్టర్ అనిరుద్ధ దేశ్ పాండే, డాక్టర్ రాజ సెల్వం శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం మొత్తం తిరిగి ప్రజలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం పలు రికార్డులు పరిశీలించి ఆరోగ్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ షేక్ అఫ్రోజ్ జాన్, పార్వతమ్మ, సూపర్‌వైజర్ రామ్మోహన్ పాల్గొన్నారు

మాతృభాషా దినోత్సవం

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలోని సీజనల్ హాస్టల్‌లో ఉషోదయ గ్రామీణాభివృద్ధి సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కె.అయ్యన్నగౌడ్, కేర్ టేకర్ బంగి లక్ష్మన్న మాట్లాడుతూ అమ్మప్రేమలా స్వచ్ఛమైనది, చిన్నారుల నవ్వులా అచ్చమైనది, అమృతం కన్నా తీయనైనది మాతృభాష అని చెప్పారు. మాతృ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని సూచించారు.

కమ్మనైన భాష తెలుగు

దేవనకొండ: కమ్మనైన భాష మన తెలుగు భాష అని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పాఠశాలల్లో మాతృ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మాతృభాష గొప్పదనాన్ని ఉపాధ్యాయులు వివరించారు. తెలుగుభాషపై మంచి పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

తెలుగు సాహితీ పుస్తకాల అందజేత



పుస్తకాలతో ట్యూటర్, విద్యార్థినులు

వెల్దుర్తి: స్థానిక బీసీ బాలికల హాస్టల్‌లో నిర్వహిస్తున్న మినీ గ్రంథాలయానికి జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి బలిజ శ్రీరాములు తెలుగు సాహితీ పుస్తకాలను అందజేశారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ ద్వారా ఆయన ఈ పుస్తకాలను హాస్టల్ ట్యూటర్ గఫూర్‌కు అందించారు. పుస్తక పఠనంతో జ్ఞానాభివృద్ధి, మాతృభాషపై పట్టు లభిస్తుందని చెప్పారు.

సామూహిక వివాహాలకు విరాళం

హొళగుంద: మండల కేంద్రం శివారులో వెలసిన సోమేశ్వరస్వామి ఆలయంలో శివమాల ధారుల ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించే సామూహిక వివాహాలకు ఎల్లెల్సీ హొళగుంద డిస్ట్రిబ్యూటరీ కమిటీ సాగు నీటి సంఘం అధ్యక్షుడు మిక్కిలినేని వెంకట శివప్రసాద్ శుక్రవారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. మాజీ సర్పంచ్ రాజ పంపన్నగౌడ్, బాబీ, అలేఖ్య విజయ్‌కుమార్ ఉన్నారు.

చిరుధాన్యాలు..

ఘనమైన లాభాలు

- మళ్లీ పెరుగుతున్న వినియోగం
- పాత తరం ఆహారానికి మళ్లుతున్న జనం
- వ్యాధుల నివారణకు ఏకైక మార్గంగా వైద్యుల సూచన
- చిరుధాన్యాల్లో సంపూర్ణ పోషకాలు

పట్టుమని పదేళ్లు నిండని బాలలకు షుగర్.. మూప్పై ఏళ్లు కూడా దాటని యువకుడికి బీపీ, షుగర్.. కాలానుగుణంగా విధి నిర్వహణ, బాధ్యతల్లో ఒత్తిళ్లతో పాటు ఆహారపు అలవాట్లు మారడంతో చిన్న వయస్సులోనే వ్యాధుల బారిన పడుతున్నారు. వీటిన్నింటికీ పరిష్కారం పాత తరం ఆహారమే దివ్య ఔషధమని వైద్యులు పేర్కొంటున్నారు. నాడు చిరుధాన్యాల వినియోగం అధికంగా ఉండటంతో వ్యాధుల ప్రభావం తక్కువగా ఉండటమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం చిరుధాన్యాల వినియోగం పెరగడంతో పాటు సాగు కూడా క్రమంగా అధికమైంది.

పత్తికొండ రూరల్ : రోజువారీ ఆహారంలో మిల్లెట్స్ వాడకం ఇప్పుడు ఓ స్పెషల్. దీర్ఘకాల వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు ప్రస్తుతం చిరుధాన్యాల వినియోగంపై ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపుతున్నారు. జీవన విధానంలో కాలానుగుణంగా వస్తున్న మార్పులతో ప్రజలు ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. చిరుధాన్యాల పరిమాణం చిన్నగా ఉన్నప్పటికీ.. వీటి ఆరోగ్య ప్రయోజనాలు మెండుగా ఉన్నాయి. మెరుగైన ఆరోగ్యం కోసం వీటిని ఉపయోగించే వారి సంఖ్య కూడా రోజురోజుకూ పెరిగిపోతుండటం శుభపరిణామంగా నిపుణులు చెబుతున్నారు.

దీర్ఘాయుష్కులుగా పూర్వికులు..

మన పూర్వికుల ఆహారపు అలవాట్లతో రోజంతా ఉత్సాహంగా ఉండటమే కాకుండా వారి జీవిత కాలం కూడా ఎక్కువగా ఉండేది. మారిన ఆధునిక అలవాట్లు అనారోగ్యాన్ని తెచ్చిపెడుతున్నాయి. యాంత్రిక జీవనంలో ఆహారంలోకి వింత, విపరీతమైన పోకడలు చొరబడి మనిషి మనుగడకే ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయి. జంక్ ఫుడ్స్‌తో కడుపు నింపుకుంటూ మనిషి ఆయుర్దాయం సగానికి పడిపోయింది. క్లిష్టమైన పరిస్థితులను ఆహారపు అలవాట్లలో మళ్లీ మార్పు కనిపిస్తోంది. రోజూ వారి ఆహారంలో జొన్న, సద్ద రొట్టెలు కొర్రలు, రాగుల వినియోగం పెరిగింది. ఈ క్రమంలో రైతులు చిరుధాన్యాల సాగుపై మక్కువ చూపుతున్నారు.



పత్తికొండలోని ఓ దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న చిరుధాన్యాలు

పెట్టుబడి తక్కువ..

పత్తికొండ వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఖరీఫ్, రబీ సీజన్‌లో చిరుధాన్యాలు సాగవుతున్నాయి. పత్తికొండ సబ్‌డివిజన్‌లో రబీ సీజన్‌లో జొన్న పంట 2,769 హెక్టార్లలో సాగు చేయగా, ఖరీఫ్‌లో సజ్జ 4,326 ఎకరాల్లో సాగుచేశారు. ఎద్దులతో సేద్యం చేయడం, సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఈ పంటల సాగుకు అధిక పెట్టుబడి, శ్రమ తక్కువగా ఉండటం ..మార్కెట్‌లో ఈ ఉత్పత్తులకు డిమాండ్ ఉండటంతో మంచి ధర లభించి రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు..



మిల్లెట్స్‌తో వండిన ఆహారం

చిరుధాన్యాల వాడకం దివ్య ఔషధం



చిరుధాన్యాల్లో ఉన్న పోషకాలు శరీరంలోని చిన్నచిన్న శారీరక రుగ్మతలను దూరం చేస్తాయి. వీటిలో ఉన్న పోషకాలు మెరుగైన ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. వీటి వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ప్రతి రోజు డైట్‌లో చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇస్తే దివ్య ఔషధంగా ఉపయోగపడుతుంది. బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు ముందు జాగ్రత్తగా కూడా ఇవి ఉపయోగపడుతాయి.

– కల్పన, వైద్యాధికారిణి, ప్రభుత్వాసుపత్రి,పత్తికొండ

ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య

మద్దికెర : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య కేటాయిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏఓ రవి కోరారు. శుక్రవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో రైతు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. నమోదుకు రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. అలాగే రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను తెలియజేసి ఈ–కేవైసీ చేయించుకోవాలని చెప్పారు.

26న దేవమ్మ రథోత్సవం

హొళగుంద: మండల కేంద్రంలో వెలిసిన దేవమ్మ దేవి రథోత్సవ కార్యక్రమం ఈనెల 26వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు దేవమ్మ భక్త మండలి సభ్యులు శుక్రవారం తెలిపారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని రథోత్సవం చేపడుతున్నామని అందులో భాగంగా శుక్రవారం కంకణధారణ చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మహా మంగళారతి తదితర పూజలు జరిపించారు.

సారా తయారుచేస్తే కేసులు

తుగ్గలి : సారా తయారీ, విక్రయాలు వెంటనే మానుకోవాలని పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం రోళ్లపాడు తండా శివారులో నాటుసారా బట్టీలను ధ్వంసం చేసి బెల్లం ఊటను పారబోశారు. సీఐ మాట్లాడుతూ..సారా తయారు చేసినా, అమ్మకాలు జరిపినా బాధ్యులపై బైండోవర్, పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సారా తయారీ, కేసులతో జరిగే నష్టాలను వివరించారు.

లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఏవీఎస్ శ్రీవల్లి

పత్తికొండ రూరల్ : మార్చి 8వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ని జయప్రదం చేయాలని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఏవీఎస్ శ్రీవల్లి కోరారు. శుక్రవారం స్థానిక బార్ అసోషియేషన్ కార్యాలయంలో జూనియర్ సివిల్ జడ్జి న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 8న లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని న్యాయవాదులు తమ పరిధిలో ఉన్న రాజీ కాదగిన కేసులను గుర్తించి కక్షిదారులతో మాట్లాడి వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రంగస్వామి, సీనియర్ న్యాయవాదులు సురేష్‌కుమార్, మైరాముడు, సత్యనారాయణ, వెంకట్రాముడు, నాగభూషణ్‌రెడ్డి, రమేష్ బాబు, మల్లికార్జున, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- జాయింట్ కలెక్టర్ నవ్య



పీ.కొత్తూరు వద్ద రీ సర్వేను పరిశీలిస్తున్న జేసీ నవ్య

తుగ్గలి : భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ నవ్య ఆదేశించారు. మండలంలోని పీ.కొత్తూరు పొలాల్లో సర్వే బృందాలు చేస్తున్న రీ సర్వేను శుక్రవారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీ సర్వే ఎంత మంది చేస్తున్నారు, ఎన్ని ఎకరాల్లో చేస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే చేసే భూముల్లో ముందుగా సంబంధిత రైతులకు సమాచారం అందించాలన్నారు. ఎక్కడా తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు రీ సర్వేపై తమ అనుమానాలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. ట్రైనీ కలెక్టర్ కళ్యాణి, ఇన్‌చార్జ్ ఆర్డీవో వెంకటేష్ తహసీల్దార్ రమాదేవి, ఆర్ఐ వెంకటరాముడు, మండల సర్వేయర్ సుధాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ద్వారానే టమాట కొనుగోలు

పత్తికొండ రూరల్ : ప్రభుత్వం ద్వారానే టమాట కొనుగోలు చేసి కర్నూలు రైతు బజారుకు తరలిస్తామని జాయింట్ కలెక్టర్ బి.నవ్య తెలిపారు. కొన్నిరోజుల క్రితం టమాట కొనుగోలు కేంద్రం మూతబడింది. దీంతో టమాట రైతులకు గిట్టుబాటు ధర లేక, కొనుగోలు కేంద్రం లేకపోవడంతో శుక్రవారం పత్తికొండలోని వ్యవసాయ మార్కెట్ యార్డును జేసీ తనిఖీ చేసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ స్థానిక రైతుల నుంచి వ్యాపారులు కిలో రూ.10 గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని, లేదంటే ప్రభుత్వం ద్వారానే కొనుగోలు చేసి కర్నూలులోని రైతు బజారుకు తరలిస్తామని చెప్పారు. ఉద్యానవన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సత్యనారాయణ, మార్కెట్ సెక్రెటరీ కార్నలీస్ ఉన్నారు.

న్యాయవాద సవరణ బిల్లు అప్రజాస్వామ్యం



పత్తికొండ కోర్టు ఆవరణలో ఆందోళన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పత్తికొండ రూరల్ : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రతిపాదించిన న్యాయవాద సవరణ బిల్లు–2025 అప్రజాస్వామికమని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి.రంగస్వామి, సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, సురేష్‌కుమార్, ఆవుల మైరాముడు అన్నారు. అడ్వకేట్స్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం పత్తికొండలోని కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ న్యాయవాదుల హక్కులను కాలరాయడమే కాకుండా న్యాయవ్యవస్థ స్వతంత్రప్రతిపత్తిని దెబ్బతీసేలా ఉందన్నారు. కేంద్రం వెంటనే బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. న్యాయవాదులు రమేష్ బాబు, నాగభూషణంరెడ్డి, నాగేష్, సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

చెత్త తొలగదు.. మురుగు పారదు!

కృష్ణగిరి: మండలంలోని పలు గ్రామాల్లో మురుగు కాల్వల్లో చెత్త పేరుకపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఎక్కడ మురుగు అక్కడే పేరుకపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మురుగు కాల్వల్లో ప్లాస్టిక్ గ్లాసులు, సీసాలు, చెత్త చెదారం నిండి పోవడంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. దీంతో కాల్వ వద్ద దుర్వాసనతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయని, అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కోయిలకొండలో ప్రధాన రహదారి పక్కనున్న కాల్వలో మురుగు

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



ఆలూరు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది



చిప్పగిరి మండల కార్యాలయం వద్ద మహిళల పడిగాపులు

తుగ్గలి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్వయం ఉపాధి పథకం ద్వారా శుక్రవారం సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది దరఖాస్తుదారుల నుంచి సర్టిఫికెట్లు స్వీకరించారు. ఆయా కులాలకు సంబంధించి మండలంలోని 23 పంచాయతీలకు 50 యూనిట్లు మంజూరు కాగా 830 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీఓ విశ్వమోహన్, ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప, జొన్నగిరి ఏపీజీబీ మేనేజర్ లోకేష్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు పరిశీలన

మద్దికెర : ప్రభుత్వం స్వయం ఉపాధి పొందేందుకు సబ్సిడీతో అందజేస్తున్న రుణాలకు అభ్యర్థుల ధ్రువపత్రాలను శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కొండయ్య, పెరవలి గ్రామంలోని సచివాలయంలో ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి ఆధ్వర్యంలో పరిశీలించారు.

తూతూ మంత్రంగా ఇంటర్వ్యూలు

ఆలూరు రూరల్: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటర్వ్యూలు శుక్రవారం ఎంపీడీ కార్యాలయంలో తూతూ మంత్రంగా జరిగాయి. బీసీ,ఈబీసీ,కాపు కార్పొరేషన్ రుణాల కోసం మండలంలో 691 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా ఆలూరు,మొలగవల్లి ఎస్బీఐ, ఆలూరు ఏపీజీబీ, యూనియన్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంకు అధికారులు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో కలిసి దరఖాస్తులు పరిశీలించారు. దరఖాస్తు ఫారాలు తీసుకుని పుస్తకంలో సంతకం చేయించుకుని పంపించారు. 382 మంది దరఖాస్తుదారులు హాజరైనట్లు ఎంపీడీఓ మహబూబ్ బాషా వెల్లడించారు.

గందరగోళంగా ఇంటర్వ్యూలు

చిప్పగిరి: బీసీ కార్పొరేషన్ రుణాలకు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలు గందరగోళం మధ్య ముగిశాయి. మండలానికి 50 యూనిట్లకు గాను 405 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా చిప్పగిరి నుంచి 88 మంది దరఖాస్తు చేసుకోగా అత్యల్పంగా గుమ్మనూరు నుంచి ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూ కోసం దరఖాస్తుదాలు కార్యాలయానికి రావడంతో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. ఇంటర్వ్యూలు సాయంత్రం వరకు నిర్వహించాల్సి ఉన్నా బ్యాంకు సిబ్బంది తూతూ మంత్రంగా నిర్వహించి వెళ్లిపోవడంతో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది గ్రామాల వారీగా దరఖాస్తుదారుల నుంచి ధ్రువ పత్రాల జిరాక్స్ కాపీలను తీసుకొని కార్యక్రమం ముగించారు. ఎంపీడీఓ అల్లాబకాష్, బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్ : సబ్సిడీ రుణాల మంజూరుకు పత్తికొండ ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీడీఓ సువర్ణలత ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని బీసీ–70, ఓసీ–7 యూనిట్లకు సుమారు 1200 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 670 మంది హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. మండలంలో ఉన్న 5 బ్యాంకుల మేనేజర్లు దరఖాస్తుదారుల అర్హత ప్రతాలను పరిశీలించారు.

హాలహర్వి: రుణాలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు సాగాయి. ఎంపీడీఓ వరలక్ష్మి, ఆయా బ్యాంకుల మేనేజర్లు నిరుద్యోగ అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించారు.

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు నిరుద్యోగులు అధికంగా హాజరయ్యారు. కృష్ణగిరి, వెల్దుర్తి, చిట్యాల గ్రామాల్లోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుల పరిధిలో ఉన్న గ్రామాలకు సంబంధించి 245 మంది నిరుద్యోగులు హాజరైనట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏఓ రామస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి బ్యాంక్ అధికారులు నాగలింగేశ్వరుడు, శివప్రసాద్, లింగన్న హాజరయ్యారు. డోన్ ఏపీజీబీ, వెల్దుర్తి స్టేట్ బ్యాంక్ పరిధిలోని గ్రామాలకు కూడా త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

50 యూనిట్లు.. 423 దరఖాస్తులు

హొళగుంద: సబ్సిడీ రుణాలకు కెటాయించిన 50 యూనిట్లకు 423 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. దారఖాస్తుదారులకు త్వరలో హొళగుంద ఎస్‌బీఐ, హెబ్బటం ఆర్జీబీ బ్యాంక్ అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆధ్యాత్మికం

ప్రత్యేక పూజలు



గాయత్రీ మాత

ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ, గోవిందు, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

బ్రహ్మోత్సవ కార్యక్రమాలకు ఒప్పందాలు

మద్దికెర : పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తామని, సున్నం పూతలు, బాణసంచా, పది రోజుల పాటు వంట చేయుట..తదితర వాటికి ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు దేవాలయ ఆవరణలో ఒప్పందాలు చేసుకుంటామని ఆసక్తి గల వారు కార్యాలయంలో సంప్రదించాలని ఆలయ ఈఓ వీరయ్య శుక్రవారం తెలిపారు. వివరాలకు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.

నివాళి

చిప్పగిరి:మండలంలోని బెల్డోణ గ్రామనానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దుర్గయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి గ్రామానికి చేరుకొని మృతదేహం పై పూలమాల ఉంచి నివాళులర్పించి, మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వన్నూరుస్వామి ఉరుసు ప్రారంభం

దేవనకొండ: మండలంలోని కరివేముల గ్రామంలో హజరత్ వన్నూరుస్వామి ఉరుసు శుక్రవారం గంధం కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దర్గాకు చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం ఉరుసు, ఆదివారం జియారత్ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

భజన పోటీలు..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. గెలుపొందినవారికి వరుసగా..రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు,రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1500 అందిస్తామని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు రూరల్: కర్ణాటక మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై ఆలూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం విస్తృత దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా అధికారి రామకృష్ణా రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలూరు, హొళగుంద మండలాల్లోని వివిధ గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీల్లో భాగంగా ఆలూరు మండలంలోని ముద్దనగేరి గ్రామానికి చెందిన ఈడిగ వెంకటేశ్వర్లు ఇంట్లో నిల్వ చేసిన 7 బాక్సుల కర్ణాటక మద్యం (678 టెట్రా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.30 వేల ఉంటుందన్నారు. మద్యం నిల్వ చేసుకున్న వెంకటేశ్వర్లును అదుపు తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

పది లీటర్ల నాటుసారా స్వాధీనం

హొళగుంద మండలంలోని ఎల్లార్తి నుంచి నెరణికి గ్రామానికి వెళ్లే రహదారిలో తనిఖీలు చేపట్టామని ఎక్సైజ్ సీఐ లలిత తెలిపారు. ఎల్లార్తి గ్రామానికి చెందిన గాదిలింగ వద్ద 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, గాదిలింగను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎస్ఐ నవీన్ కుమార్, సిబ్బంది సోమేష్,విజయ్ కుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న ఆస్పరి సీఐ మస్తాన్‌వలి

మద్దికెర : ఆడపిల్లలకు చదువు నేర్పిస్తే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, ప్రిన్సిపాల్ సవిత అన్నారు. శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల్లో అనారోగ్యం, రకతహీనత, అకాల గర్భం, నిరక్షరాస్యత, ప్రసూతి మరణాలు, పేదరికం, శిశు మరణాలు సంభవిస్తాయన్నారు.

- ఆస్పరి: బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆస్పరి సీఐ మస్తాన్‌వలి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో బాల్య వివాహాలు అరికట్టాలని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు బేగం, లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- ఆలూరు: బాల్య వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని ఎంఈఓ కోమలాదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఎల్లార్తి రోడ్డు సమీపంలోనున్న జెడ్పీ ఉన్నత బాలికల ఉపాధ్యాయశాల నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.
- దేవనకొండ: బాల్యవివాహాలను అరికట్టాలని కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ సునీత అన్నారు. శుక్రవారం విద్యార్థినీలతో కలిసి దేవనకొండలో బాల్యవివాహాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. అమ్మాయి లకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు వ చ్చిన తర్వాతనే వివాహాలు జరిపించాలన్నారు. అలా కాదని వివాహాలు జరిపిస్తే కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు.
- తుగ్గలి : బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని ఇన్‌చార్జ్ హెచ్ఎం రాజ్‌మోహన్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- హాలహర్వి: ప్రతిఒక్కరూ బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీడీఓ వరలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ–2 శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం హుసేన్‌సాబ్, పంచాయతీ కార్యదర్శి ఈరన్న పాల్గొన్నారు.